నగరం.. జలమయం



బుజబుజనెల్లూరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద నీటిలో నిలిచిపోయిన కారు

- రోజంతా కుండపోత
- చెరువులను తలపిస్తున్న ప్రధాన రహదారులు
- అండర్ బ్రిడ్జిల్లోకి భారీగా చేరిన నీరు
- రాకపోకలకు అంతరాయం
- స్తంభించిన జన జీవనం

నెల్లూరు(బారకాసు): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. జీఎన్టీ రోడ్డు, బుజబుజనెల్లూరు, అయ్యప్పగుడి, ఆర్టీసీ కాలనీ, మాగుంట లేఅవుట్, స్టోన్‌హౌస్‌పేట, వెంగళరావునగర్, చంద్రబాబునగర్, వైఎస్సార్‌నగర్, మెక్లిన్స్‌రోడ్డు, రంగనాయకులపేట, గొల్లవీధి, కాపువీధి, ట్రంక్‌రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్, సండే మార్కెట్, లీలామహల్ సెంటర్ తదితర ప్రాంతాల్లోని రహదారులు చెరువులను తలపించాయి. మాగుంట లేఅవుట్, ముత్తుకూరు గేట్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జిల్లోకి వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురుగాలులకు పలు ప్రాంతాల్లో చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి సమీపంలో ఓ భారీ చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది.

అధికారులు అప్రమత్తం

మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టారు. కార్పొరేషన్ పరిధిలో 13 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బాధితులను అక్కడికి చేర్చి వారికి అవసరమైన ఆహారం ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నారు.



ఈదురుగాలులకు నేలకొరిగిన బ్యారికేడ్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్లలో గల నల్లకాలువ, గాంధీ గిరిజన కాలనీ, పెట్రోల్ బంక్ గుంట, భగత్‌సింగ్ కాలనీలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గాంధీ గిరిజన కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న వారికి ఆహారాన్ని అందజేశారు. లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు తదితరులు పరిశీలించారు. పెట్రోల్ బంక్ గుంట ప్రాంతంలో నిలిచిన నీటిని మోటార్ల సాయంతో తొలగిస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఈదురుగాలులతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు తెగిపోయాయి. మరోవైపు చెట్లపై కొమ్మలు పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



బారాషహీద్ దర్గా ప్రాంగణంలో కూలిన చెట్లు



గాంధీబొమ్మ సెంటర్‌లో..



నిర్మానుష్యమైన ముత్తుకూరు గేట్ కూడలి



నీటమునిగిన తల్పగిరి కాలనీ



గాంధీ గిరిజన కాలనీ సమీపంలో..



వెంకటేశ్వరపురంలోని ఫ్లయ్‌ఓవర్ కింద నిలిచిన వర్షపునీరు

పునరావాస కేంద్రాల్లో పరిశీలన



నెల్లూరు(బారకాసు): తుఫాన్ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను కమిషనర్ వికాస్ మర్మత్ సోమవారం పరిశీలించారు. కర్ణాలమిట్ట స్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అందుతున్న సేవలు, ఇతర సదుపాయాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రాల్లో ఉన్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కేంద్రాలకు వస్తున్న వారి సంఖ్య, వివరాలను నమోదు చేసి ఎప్పటికప్పుడు తనకు తెలియజేయాలన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో మేయర్ పర్యటన



నెల్లూరు(బారకాసు): వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. వెంగళరావునగర్, వైఎస్సార్‌నగర్, చంద్రబాబునగర్, బుజబుజనెల్లూరు, ఆర్టీసీకాలనీ తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ విభాగాధికారులతో సోమవారం పర్యటించిన ఆమె మాట్లాడారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించి సూచనలు చేశారు. ప్రధాన మార్గాల్లో కూలిన చెట్లను తొలగించాలని ఆదేశించారు.

క్లుప్తంగా

కలుషిత నీటిని తాగొద్దు



నర్సారెడ్డి కాలనీలో వృద్ధులతో మాట్లాడుతున్న డాక్టర్

పొదలకూరు : తుపాను ప్రభావంతో కొత్తనీరు వచ్చి చేరుతున్న క్రమంలో ప్రజలు కలుషిత నీటిని తాగొద్దని పొదలకూరు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ డాక్టర్ రిషిత సూచించారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీలో సిబ్బందితో కలిసి ఆమె సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. వర్షపునీటి వల్ల దోమల ఉధృతి పెరుగుతుందని, తద్వారా అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. మలేరియా, టైఫాయిడ్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైతే వెంటనే సమాచారం అందించాల్సిందిగా సూచించారు. కాలనీలో ఉన్న వృద్ధుల ఆశ్రమాన్ని పరిశీలించారు. పరిశుభ్రమైన భోజనాన్ని తీసుకోవాల్సిందిగా సూచించారు. డాక్టర్ వెంట విస్తరణాధికారి రవికుమార్, సహాయకులు రాధాకుమారి, సాని శివప్రసాద్ ఉన్నారు.

శ్రామికనగర్‌లో..

పట్టణానికి చెందిన లింగంపల్లి సబ్‌సెంటర్ పరిధి శ్రామిక నగర్‌లో వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యటించి అక్కడి గిరిజనులకు పలు సూచనలు చేశారు. ఏమైనా అవసరం ఉంటే తమకు సమాచారం అందిస్తే పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా మేకల లక్ష్మమ్మ అనే డయాలసిస్ బాధితురాలిని 108లో నెల్లూరుకు తరలించారు. ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, కారుణ్య, సుధా, ఆశావర్కర్ భారతి పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఊడిపడిన బస్సు లగేజి క్యారియర్



బస్సు టాప్‌పై నుంచి కిందపడిన లగేజి క్యారియర్

పొదలకూరు: పొదలకూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న ఆర్టీసీ బస్సు టాప్‌పై ఉండే లగేజి క్యారియర్ ఈదురుగాలులకు ఒక్కసారిగా గాలిలో ఎగిరి రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తు బస్సు వెనక వైపు ఏ వాహనం రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటన సోమవారం పొదలకూరుకు సమీపంలోని కాకాణి గార్డెన్స్ లేఅవుట్ వద్ద జరిగింది. అయితే బస్సు డ్రైవర్ చూసుకోకుండా వెళ్లిపోవడంతో రోడ్డుపై పడిన లగేజి క్యారియర్‌ను లేఅవుట్ యజమాని పక్కన పెట్టించారు.

గంజాయి అక్రమ రవాణా చేస్తే చర్యలు

ఉదయగిరి: గంజాయి అక్రమ రవాణా చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఉదయగిరి సీఐ గిరిబాబు, కోవూరు సెబ్ సీఐ నరహరి హెచ్చరించారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఇతర ప్రాంతాల నుంచి ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేస్తుంటే వారిపై దృష్టి సారించి సంబంధిత శాఖలకు సమాచారం అందించాలన్నారు. నిషేధిత గంజాయి ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. గంజాయి విక్రయించినా, అక్రమ రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

51 మంది రక్తదానం

వరికుంటపాడు: రక్తదాత, రక్తదాన చైతన్యకర్త మండలంలోని పెద్దిరెడ్డిపల్లికి చెందిన పచ్చల లక్ష్మయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు పచ్చవ పెదవెంగయ్య, చినవెంగయ్య, భూమయ్య జేవీవీ మండల శాఖ సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 51 మంది రక్తదాతలు పాల్గొని రక్తదానం చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్నెళ్లకోసారి రక్తదానం చేయాలన్నారు. అనంతరం పలువురు లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు వెంకటసుబ్బయ్య, చెన్నకేశవులు, రమణయ్య, పీఎం చలం, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, పి.తిరుపతిరెడ్డి, ఎం.తిరుపతిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పైర్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరురూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో సాగులో ఉన్న వరి, పత్తి, పొగాకు, తదితర పైర్లు భారీ వర్షాలు కారణంగా దెబ్బతినకుండా రైతులు జాగ్రత్త వహించాలని ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీఏ దేవసేనమ్మ, ఏఓ కిషోర్‌బాబు తెలిపారు. మండలంలోని వాశిలి, బట్టేపాడు, అప్పారావుపాళెం, బోయలచిరివెళ్ల గ్రామాల్లో వరి నాట్లు జరుగుతున్న పొలాలను సోమవారం వారు పరిశీలించారు. పొలాల్లో నీరు నిల్వ లేకుండా బయటికి పంపించేందుకు రైతులు తప్పక చర్యలు తీసుకోవాలన్నారు.

యుద్ధప్రాతిపదికన చర్యలు

నెల్లూరు(బారకాసు): మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో వర్ష ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. రామలింగాపురం, మాగుంట లేఅవుట్ అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలను ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి సోమవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నీటి ప్రవాహం సజావుగా సాగేలా కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. కూలిన చెట్లను వెంటనే తొలగించాలని సూచించారు. ప్రధాన మార్గాలు, అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తోడేయాలని కోరారు. ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా, ఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాగుంట లేఅవుట్‌లోని అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

విపత్తు నివారణలో అగ్నిమాపక శాఖ

నెల్లూరు(క్రైమ్): తుఫాన్ సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. పలుచోట్ల చెట్లు కూలిపోయి వాహనాల రాకపోకలు స్తంభించాయి. సమాచారం అందుకున్న ఏడీఎఫ్‌ఓ వేణుగోపాల్‌రావు తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. కలెక్టర్ బంగ్లా సమీపంలో భారీ చెట్టు కూలి భవనం, ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో స్కై లిఫ్టు సాయంతో కొమ్మలను తొలగించారు. కొండాయపాళెం గేట్, పాత పోలీస్ కార్యాలయం, రాజరాజేశ్వరిగుడి, కొత్తూరు, బట్వాడిపాళెం సెంటర్లలో భారీ చెట్లు నేలకొరగడంతో యుద్ధప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అత్యవసరమైతే 99637 34284, 99499 91066, 101, 0861 – 2331051 నంబర్లకు సమాచారమివ్వాలని ఏడీఎఫ్‌ఓ కోరారు.

ఆహారం అందజేత

నెల్లూరు సిటీ: భారీ వర్షాలతో ఇబ్బంది పడుతున్న వారికి ఆహారం, నీరు, బిస్కెట్ ప్యాకెట్లను రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అందజేశారు. సుందరయ్యకాలనీ, ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి ఆహారాన్ని అందజేశారు.

విపత్కర పరిస్థితుల్లో సాయం చేసేందుకు రెడ్‌క్రాస్ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. సాయం కోసం 96471 08108 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మూగజీవాలు జాగ్రత్త

నెల్లూరు(సెంట్రల్): తుఫాన్‌తో మూగజీవాలకు ఇబ్బందుల్లేకుండా జాగ్రత్త వహించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మహేశ్వరుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలతో వివిధ రోగాలు వచ్చే అవకాశం ఉందని, సమీపంలోని పశు వైద్యులను సంప్రదించి తగు సూచనలు పొందాలని కోరారు. మూగజీవాలు మరణిస్తే సమీపంలోని పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేసి నమోదు చేసుకోవాలని సూచించారు.

అండగా ఉంటాం..

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): భారీ వర్షాల నేపథ్యంలో 24వ డివిజన్లోని ఇందిరమ్మ కాలనీలో ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోమవారం పర్యటించారు. ఇందిరమ్మ కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్లలోకి నీరు చేరడంతో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. డ్రైనేజీ కాలువపై అక్రమ కట్టడాలతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని, వెంటనే తొలగించి ఇబ్బందుల్లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డివిజన్ ఇన్‌చార్జీలు మురళీయాదవ్, ఇసనాక సురేంద్రరెడ్డి, సునీల్‌యాదవ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కాలనీలో పర్యటిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు(బృందావనం): వీఆర్సీ సెంటర్‌లోని డొనీహాల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ (ఎన్‌పీఏ) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తెలుగుగంగ జాయింట్ కలెక్టర్ ఓబులేసు కేక్‌ను కట్ చేశారు. ఎన్పీఏ గౌరవాధ్యక్షుడు బెన్హర్ బాబు వాక్య సందేశాన్ని అందించారు. నెల్లూరు పాస్టర్స్ అసెంబ్లీ కమిటీ నిర్వాహకులు రాఘవ మోజెస్, సురేంద్రబాబు, అరవ దాసు,, బర్నబాస్, అరుణ్‌కుమార్, డేవిడ్ దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



విచారణకు వినతి

నెల్లూరు(దర్గామిట్ట): ఎలాంటి ప్రభుత్వ అనుమతుల్లేకుండానే ఐటీడీఏ పాత కార్యాలయాన్ని కూల్చేశారని, దీనిపై విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి కోరారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతిపత్రాన్ని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం అందజేశారు. కాగా సంబంధిత అధికారులకు తెలిపి పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.



మంత్రి కాకాణికి వినతిపత్రమిస్తున్న రవి



ఇందుకూరుపేట: మైపాడు బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు



ఇందుకూరుపేట: మైపాడు - నెల్లూరు మార్గంలో వర్షపునీటిపై వెళ్తున్న వాహనం

ఘనంగా ఘంటసాల జయంతి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఘంటసాల జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరు విష్ణువర్ధన్, సుమన్‌ను సత్కరించారు. తొలుత ఘంటసాలకు నివాళులర్పించారు. సంగీత విభావరిని సుస్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించారు. పేరూరి ప్రదీప్, కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు సుబ్బారావు, కార్పొరేటర్ వేలూరు మహేష్, గాదంశెట్టి గోపాల్, అశోక్, సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరుడి సేవలో డీఆర్డీఏ పీడీ

విడవలూరు : మండలంలోని రామతీర్థం గ్రామంలో కొలువైన రామలింగేశ్వర స్వామిని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాంబశివారెడ్డి కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. దేవస్థానం చైర్మన్ నాటూరు చంద్రయ్య తొలుత వారికి స్వాగతం పలికి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం సర్పంచ్ సుజన, సచివాలయ కన్వీనర్ నరేష్, వరిణి సొసైటీ డైరెక్టర్ కాటం శీనయ్య, పార్టీ నేతలు ఎం.శ్రావణ్, టి.రమేష్ డీఆర్‌డీఏ పీడీని మర్యాద పూర్వకంగా కలిశారు.



కడలి కల్లోలం



ఇందుకూరుపేట : సోమరాజుపల్లి రోడ్డుపై నీటి ప్రవాహం



ఇందుకూరుపేట: మైపాడులోని పునరావాస కేంద్రంలో వరద బాధితులు

ఇందుకూరుపేట : మిచాంగ్ తుపాన్ కారణంగా కడలి కల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున్న ఎగసిపడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు వేట సామగ్రిని భద్రపరుచుకున్నారు. ఎడతెరిపిలేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. ఇప్పటికే వాగులు వంకలు పొంగి పొర్లడంతో రోడ్లపై నీరు నిలిచింది. దీంతో ముదివర్తిపాళెం, సోమరాజుపల్లి తదితర గ్రామాలకు వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల నాట్లు వేయడంతో అవి కూడా మునిగిపోయాయి. ఈదూరు గాలులతో పదుల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో తాగునీటి, అవసరాలకు ఇబ్బందులు పడుతున్నారు. కరెంట్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. మైపాడు, గంగపట్నం, రాముడుపాళెం, సోమరాజుపల్లి, ఇందుకూరుపేట, నిడిముసలి, ముదివర్తిపాళెం తదితర గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి వరద బాధితులను తరలించారు. వారికి అవసరమైన ఆహారం, పాలు, ముందులు తదితర వాటిని అందజేస్తున్నారు.